క్లుప్తంగా

వైభవంగా బీరప్ప పండుగ



ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడ్గుల: మండల పరిధిలోని అర్కపల్లి గ్రామంలో బీరప్ప పండుగ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు గోళి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తోటి మిత్రుడికి చేయూత



వినోద్ తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

ఆమనగల్లు: మండలంలోని శంకరకొండతండా గ్రామ పరిధిలోని దయ్యాలబోడుతండాకు చెందిన వినోద్ తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఒవైసీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలియడంతో చికిత్స కోసం అతని మిత్రులు విరాళాలు పోగుచేసి రూ.16 వేలు జమ చేశారు. సోమవారం ఆస్పత్రికి వెళ్లి వినోద్ తల్లిదండ్రులకు నగదు అందించారు. కార్యక్రమంలో రాజు, రాజేశ్, శ్రీను, నవీన్, ప్రవీన్, రవి, పూల్‌సింగ్, జయలాల్, విజయ్, సాయికుమార్, సుమన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు పరామర్శ



సాయిలును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ఆమనగల్లు గ్రామ మాజీ వార్డు సభ్యుడు, బీఆర్‌ఎస్ నాయకుడు వస్పుల సాయిలు తల్లి మైసమ్మ మృతిచెందడంతో సోమవారం ఆయన్ని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ ఖలీల్, లాలయ్యగౌడ్, సైదులుగౌడ్, భాస్కర్, జంగయ్య తదితరులు ఉన్నారు.

తరలిన కాంగ్రెస్ నేతలు



మాచారం బయలు దేరుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా మాచారం గ్రామంలో జరుగుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు మండలం నుంచి రాష్ట్ర చెంచు యువజన సంఘం అధ్యక్షుడు చెంచు రాములు ఆధ్వర్యంలో పలువురు నాయకులు తరలివెళ్లారు. చెంచుల పోడు భూములను సస్యశ్యామలం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టిన ఇందిరగిరి సౌర జల వికాస పథకాన్ని ముఖ్యమంత్రి మాచారం గ్రామంలో ప్రారంభించి అనంతరం బహిరంగ సభలో పాల్గొననున్న నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు మండ్లి రాములు, వస్పుల మానయ్య, ఫరీద్, సీతారాం, లక్ష్మయ్య, శ్రీదర్‌నాయక్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన నేతలు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆసీఫ్‌అలీ

కడ్తాల్: సీఎం రేవంత్‌రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఆయన స్వగ్రామం కొండారెడ్డిపల్లి గ్రామానికి విచ్చేశారు. ఈ మేరకు రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్‌అలీ సీఎంని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రేవంత్ మిత్రమండలి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను సీఎంకు వివరించినట్లు ఆసీఫ్‌అలీ తెలిపారు.

పరామర్శ

కందుకూరు: మండల పరిధిలోని రాచులూరులో పిడుగుపాటుకు గురై మూడు గేదెలు మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని సోమవారం సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జి.సామేలు, సీపీఎం నాయకుడు చిర్ర నర్సింహ తదితరులు పరామర్శించారు. బాధితులు నిరుపేదలని, ప్రభుత్వమే రూ.3లక్షలు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

తీరని 'మీసేవ' కష్టాలు

- మొయినాబాద్ మండలంలో ఒకటే సెంటర్
- చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



మొయినాబాద్ మండలంలోని రెడ్డిపల్లి మీసేవ కేంద్రం

మొయినాబాద్: మండలంలో ఒకటే మీసేవ కేంద్రం ఉంది. అది కూడా మండల కేంద్రంలో కాకుండా రెడ్డిపల్లి గ్రామంలో ఉంది. మండల ప్రజలందరూ అక్కడికి వెళ్లాలంటే చాలా కష్టంగా భావిస్తున్నారు. అందుబాటులో మీసేవ కేంద్రం లేక ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రెండు మీసేవ కేంద్రాలు మూతపడ్డాయి. మూతపడ్డ వాటిని తెరిపించి కొత్త మీసేవ కేంద్రాలు సైతం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కానీ అధికారులు మాత్రం కనీస చర్యలు తీసుకోవడం లేదు. వెంటనే కొత్త కేంద్రాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి గత నెల 24న మొయినాబాద్‌లో జరిగిన భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి విన్నవించారు. ఇప్పటికైనా మీ సేవ కష్టాలు తీరుతాయో లేదో అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నాలుగున్నరేళ్లుగా..

ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతీ 5 వేల జనాభాకు ఒక మీసేవ కేంద్రం ఉండాలి. కానీ మొయినాబాద్ మండలంలో 70 వేలకుపైగా జనాభా ఉన్నా ఒకటే అందుబాటులో ఉంది. సుమారు నాలుగున్నర సంవత్సరాలుగా ఈ పరిస్థితి ఉన్నా కొత్త మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం ముందడుగు వేయడం లేదు. దీంతో విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. మొయినాబాద్ మండల ప్రజలకు మీసేవ కష్టాలు తీరడం లేదు. సుమారు నాలుగున్నర సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొయినాబాద్ మండలంతో పాటు మున్సిపాలిటీ మొత్తానికి ఒకే మీసేవ కేంద్రం ఉండడంతో ప్రజల కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. నగర శివారు ప్రాంతంలో ఉన్న మొయినాబాద్ మండలంలో ప్రభుత్వం గతంలో మూడు మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేసింది. అందులో రెండు మీసేవ కేంద్రాలు నాలుగున్నర సంవత్సరాల క్రితమే మూతపడ్డాయి. నాలుగున్నర సంవత్సరాల క్రితం హిమాయత్‌నగర్ మీసేవా కేంద్రం నిర్వాహకుడు మరణించడంతో అది మూతపడింది. అదేవిధంగా నాలుగేళ్ల క్రితం మొయినాబాద్ మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాన్ని జిల్లా అధికారులు సీజ్ చేశారు. దీంతో రెడ్డిపల్లిలో ఉన్న మీసేవ కేంద్రం ఒక్కటే మండల ప్రజలకు దిక్కయ్యింది. మండలంలో మరో కేంద్రం లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో రెడ్డిపల్లికే వెళ్లాల్సి వస్తోంది.

అన్ని సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లోనే..

మండలంలో ఒకే మీసేవ కేంద్రం ఉండటంతో ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం ప్రతీది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండటంతో అందరూ మీసేవ కేంద్రాలకే వెళ్తున్నారు. స్కూళ్లు, కాలేజీల్లో చదివే విద్యార్థులు కులం, ఆదాయం, నివాసం, పుట్టినతేదీ సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికితోడు రెవెన్యూకు సంబంధించిన చాలా దరఖాస్తులను మీసేవ కేంద్రంలోనే చేసుకోవాలి. దీంతో విద్యార్థులు, రైతులు చాలా మంది రెడ్డిపల్లి మీసేవ వద్దకే వెళ్లాల్సి వస్తోంది. ఒకటే కేంద్రం ఉండటం అందరూ అక్కడికే వెళ్లడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. కొంత మంది ఇతర మండలాల్లోని మీసేవ కేంద్రాలకు వెళ్తున్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



రెడ్డిపల్లిలో ఒకే మీసేవ కేంద్రం ఉండటంతో రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చట్టుపక్కన గ్రామాల ప్రజలకు అంత దూరం వెళ్లడం ఇబ్బందిగా మారింది. గతంలో ఉన్న మీసేవ కేంద్రాలను తెరిపించేందుకు అధికారులు కృషి చేయాలి. మండలంలో మరికొన్ని కొత్త కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలి.

–జొన్నాడ రాజు, చిలుకూరు, మొయినాబాద్ మున్సిపాలిటీ

ప్రతిపాదనలు పంపాం



మొయినాబాద్ మండలంలో ప్రస్తుతం ఒకే మీసేవ కేంద్రం ఉంది. మండలంలో కొత్తగా మరో నాలుగు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మీసేవ కేంద్రాల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉంది.

–గౌతమ్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు

జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త డా.వాణి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డా.వాణి

మహేశ్వరం: వానాకాలం పంటకు ముందు రైతులు పొలాల్లో పచ్చిరొట్ట పైర్లను సాగు చేసుకుంటే భూసారం పెరుగుతుందని జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త డా.వాణి సూచించారు. సోమవారం మండల పరిధిలోని నందుపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించి వ్యవసాయ, ఉద్యానవన శాస్త్రవేత్తలతో రైతులు సాగులో పాటించాల్సిన సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షలను చేసి వాటి ఆధారంగా వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలను సాగు చేసుకోవాలన్నారు. వానాకాలం పంటలు సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లను సాగు చేసుకుంటే భూమి సారవంతం అవుతుందన్నారు. రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వాడితే పంట దిగుబడి అధికంగా రావడంతో పాటు తెగుళ్లు సోకవన్నారు. రైతులు ఎప్పుడు ఒకే విధమైన పంటను సాగు చేయొద్దని, పంటలను మార్చితే దిగుబడి వస్తుందన్నారు. ఈ ప్రాంతం హైదరాబాద్‌కు దగ్గర్లో ఉండడంతో ఉద్యాన పంటలు సాగు చేసుకుంటే అధిక లాభాలు వస్తాయన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా కూరగాయ, పండ్ల తోటల పెంపకం చేపట్టాలన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న యాదయ్య, తహసీల్దార్ సైదులు

మహేశ్వరం: నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో 52 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలను న్యాయం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు, బీసీ, ఓసీలకు రూ.5లక్షలు ఆర్థిక సహాయం అందించనుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరాగాంధీ హయాంలో పేదలకు భూములు పంపిణీ, ఇళ్ల స్థలాలు, ఇళ్లు పంపిణీ చేసిందన్నారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. అంతకుముందు గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఆయన అధికారులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ సైదులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆవుల యాదయ్య, గల్లా యాదయ్య, ఆవుల రఘుపతి, వర్కల రమేశ్‌గౌడ్, ఎర్ర చంద్రమోహన్, కడల భాస్కర్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐతాబాద్ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి నవీన్, బాల్‌రాజ్, ఎండీ. షఫీ, మల్లేశ్, రాజుగౌడ్, శ్రీను, బాలు పలువురు పాల్గొన్నారు.

కోళ్లపడకల్, గొల్లూర్ గ్రామాల్లో..

మండల పరిధిలోని కోళ్లపడకల్, గొల్లూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంచాయతీ కార్యదర్శులు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కల్పన, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెండ్యాల బాల్‌రాజ్, నాయకులు హరినాద్ గౌడ్, యాదయ్య, భాస్కర్, ప్రవీణ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే నిరుపేదలకు న్యాయం



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశమైన కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి

కందుకూరు: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నిరుపేదలకు న్యాయం జరుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బాచుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క పేదవాడికి ఇల్లు ఇవ్వలేదని విమర్శించారు. అప్పట్లో తెలంగాణకు మిగులు ఆదాయం ఉన్నా పేదలకు ఆనాటి ప్రభుత్వం చేసింది ఏమీ లేదన్నారు. 15 నెలల వ్యవధిలోనే సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ నియోజకవర్గానికి పెద్దఎత్తున నిధులు తెప్పించి అభివృద్ధి పనులు చేపట్టేలా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెవులపల్లి కృష్ణ, మల్లగల విజయ్, కొంతం యుగేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, నాయకులు కె.వెంకటేష్, నవీన్‌గౌడ్, కుమార్, రాజశేఖర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ నివేదిక సభ

యాచారం: ఈజీఎస్ పనుల సామాజిక తనిఖీ మండల నివేదిక సభ మంగళవారం జరుగుతుందని మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సభ ప్రారంభమవుతుందని చెప్పారు. 2024–25 ఏడాదికి సంబంధించి 24 గ్రామాల్లో రూ.6 కోట్లకు పైగా ఉపాధి పనులు కల్పించినట్లు ఆమె తెలిపారు. ఈ నెల 8 నుంచి 19 వరకు గ్రామాల్లో కల్పించిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించడం జరిగిందని, చివరగా మండల కేంద్రంలో పూర్తి నివేదికను ఆడిట్ సిబ్బంది వెల్లడిస్తారని ఆమె వివరించారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చొరవ

తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి



అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. సర్కారు భూములను గుర్తించి వాటికి హద్దులు, ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయించాలన్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిల ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే మండలంలోని గ్రామాల్లో 865.11 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు పేర్కొన్నారు. అందులో 379.25 ఎకరాల భూమి ఖాళీగా ఉందని, ప్రస్తుతం ఆ విస్తీర్ణం చుట్టూ హద్దులు ఏర్పాటు ఫెన్సింగ్ వేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేందుకు పలువురు యత్నించగా వారికి అడ్డుకొని చర్యలు తీసుకున్నామన్నారు. బాటసింగారంలోని సర్వేనంబర్ 10లో ఉన్న 250 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేసి కాపాడుతున్నామని వివరించారు.

పీఎంఏజీవై నిర్మాణాల పరిశీలన

ఇబ్రహీంపట్నం రూరల్: మండలంలోని ముకునూర్‌లో పీఎంఏజీవై పథకంలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, అంగన్‌వాడీ మూత్రశాలలను సోమవారం సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది. 2019–20వ సంవత్సరంలో ఖర్చు చేసిన నిధుల వినియోగంపై అధికారులు ఆరా తీశారు. ఎంబీ రికార్డులు పరిశీలించి కొలతలు వేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ ఉస్మాన్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, సామాజిక తనిఖీ బృందం ఎస్‌ఆర్‌పీ జీవన్, డీఆర్‌పీ గంగాధర్, మాజీ సర్పంచ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలు విజయవంతం

శంకర్‌పల్లి: గత 15 రోజుల నుంచి మండలంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతమైనట్లు మండల విద్యాధికారి అక్బర్ ప్రకటించారు. సోమవారం మండలంలోని మోకిలతండా ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం, పుస్తక పఠనం, చిత్రలేఖనం తదితర అంశాలపై పట్టు వచ్చిందన్నారు.



మంచాల: సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో అంజలి ఘటిస్తున్న యాదయ్య తదితరులు

సుందరయ్య సేవలు వెలకట్టలేనివి



తుర్కయంజాల్: సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు



యాచారంలో సీపీఎం ఆధ్వర్యంలో..

మంచాల: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం భావితరాలకు ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో ఆయన పాత్ర మరువ లేనిదన్నారు. నిస్వార్థంగా పార్టీ, ప్రజల కోసం పని చేసిన గొప్ప నాయకుడన్నారు. అనేక పోరాటాలు చేయడమే కాకుండా పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లి ప్రజా సమస్యలపై గళమెత్తిన గొప్ప నేత సుందరయ్య అని గుర్తు చేశారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బుగ్గరాములు, కృష్ణ, జగన్, లెనిన్, వెంకటేష్, అశోక్, సుధాకర్, బాలరాజు, కవిత తదితరులు పాల్గొన్నారు.

మానవతావాదికి నివాళి

తుర్కయంజాల్: పుచ్చలపల్లి సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ, చిన్నతనం నుంచే అంటరానితనం, కుల వివక్షతపైన పోరాటం చేసిన గొప్ప మానవతావాది అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.కిషన్ కీర్తించారు. సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం తుర్కయంజాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్ కుమార్, శంకరయ్య, మాధవరెడ్డి, అంజయ్య, యాకయ్య, శంకర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ఆధ్వర్యంలో సాగర్‌రోడ్డుపై అంబేడ్కర్ చౌరస్తా వద్ద సుందరయ్య చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. పేద ప్రజల సంక్షేమం, సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన ఘనత సుందరయ్యకే దక్కిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, బ్రహ్మయ్య, చందునాయక్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాచారం ఎస్‌ఐపై సీపీకి ఫిర్యాదు



ఫిర్యాదు ప్రతిని చూపిస్తున్న న్యాయవాది శ్రీశైలం

యాచారం: తమపై తప్పుడు కేసు నమోదు చేసిన యాచారం ఎస్‌ఐ మధుపై చర్యలు తీసుకోవాలని మండలంలో తక్కళ్లపల్లికి చెందిన న్యాయవాది పగడాల శ్రీశైలం సోమవారం రాచకొండ సీపీ సుదీర్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది మాట్లాడుతూ.. గత నెల 13న రోడ్డు ప్రమాదంలో గాయపడిన తన తండ్రి పగడాల బాబును మాల్‌లోని పీపుల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడ సిబ్బంది దురుసుగా ప్రవర్తించిందని చెప్పారు. ఈ క్రమంలోనే స్థానిక ఏసీపీ, డీఎంహెచ్‌ఓకు సైతం ఫిర్యాదు చేశామన్నారు. కానీ మరుసటి రోజు ఆస్పత్రి యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఏకపక్షంగా తనపై, తన కుటుంబసభ్యులపై సైతం అక్రమ కేసు నమోదు చేశారన్నారు. ఈ వ్యవహారంలో కీలకంగా ఎస్‌ఐ మధు ఉన్నాడని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ఆస్పత్రి యాజమాన్యం, ఎస్‌ఐపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని సీపీకి ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్త



మాల్ కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు

- ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు
- చోరీలు, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

యాచారం: మహిళలు ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, బంగారు నగలను తీసుకువెళ్లొద్దని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. మండల పరిధిలోని మాల్ కేంద్రంలో సోమవారం డ్రగ్స్, గంజాయి, చోరీల నివారణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు శుభకార్యాలకు వెళ్లేటప్పుడు ఒంటినిండా బంగారు నగలను వేసుకుని వెళ్లడంతో దొంగలకు మంచి అవకాశం ఇచ్చే వారవుతారని చెప్పారు. గ్రామాల్లో కొత్త వ్యక్తుల సంచారం పట్ల జాగ్రత్తగా ఉండాలని, వారి వివరాలను వెంటనే పోలీసులకు ఇవ్వాలని సూచించారు. వేసవి సెలవుల నేపథ్యంలో బంధువుల దావత్‌కు వెళ్లేటప్పుడు ఇంట్లో విలువైన వస్తువులను ఉంచరాదని పేర్కొన్నారు. ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలను బిగించుకోవాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలు కావద్దన్నారు. పిల్లల నడవడికను తల్లిదండ్రులు గమనించాలన్నారు.

మాల్ చెక్‌పోస్టు తనిఖీ

బక్రీద్ పండుగ పురస్కరించుకుని పశువుల అక్రమ తరలింపు కట్టడికి మాల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఏసీపీ రాజు సందర్శించారు. తనిఖీలపై పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రి, పగలు తేడా లేకుండా సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ మధు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



అన్మాస్‌పల్లి- కడ్తాల్ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా విరబూసిన పూల చెట్లు

ప్రయాణం.. ఆహ్లాదభరితం

కడ్తాల్: మండల కేంద్రం కడ్తాల్ నుంచి అన్మాస్‌పల్లి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా గతంలో నాటిన పూలచెట్లు(గుల్ మోహర్) ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వేసవిలో భానుడి భగభగలతో ప్రయాణిస్తున్న వాహనదారులు, బాటసారులకు నయనానందంగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం పలు చోట్ల ఏపుగా పెరిగిన చెట్లు, విరబూసిన పూలతో ఆకట్టుకుంటున్నాయి.